క్లుప్తంగా

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా వరప్రసాద్



దత్తిరాజేరు: మండల రెవెన్యూ కార్యాలయంలో డీటీ వరప్రసాద్ ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. తహసీల్దార్ విజయభాస్కర్ అయ్యప్ప దీక్ష విరమణకు శబరిమల వెళ్లేందుకు సెలవు పెట్టడంతో ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టినట్లు చెప్పారు. తన వద్దకు వచ్చిన ఫైల్స్‌ను ఎప్పటికప్పుడు పరిష్కరించడం జరుగుతుందన్నారు.

77 మందికి ఉచిత వైద్యసేవలు



రోగులకు వైద్య సేవలందిస్తున్న డాక్టర్ పుష్పాంజలి

గజపతినగరం: గజపతినగరం-1 గ్రామ సచివాలయం పరిధిలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో మరుపల్లి పీహెచ్‌సీ వైద్యురాలు పుష్పాంజలి పాల్గొని 77 మంది రోగులకు వైద్య సేవలందించారు. జ్వరం, తలనొప్పి, దగ్గు, తదితర అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లో 104 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగిసిన రైల్వేలైన్ మరమ్మతులు

దత్తిరాజేరు: మండలంలోని కోమటిపల్లి రైల్వే గేట్ వద్ద గత రెండు రోజులుగా చేపట్టిన మరమ్మతు పనులు మంగళవారం సాయంత్రంతో ముగిసినట్లు రైల్వే అధికారి శరత్‌కుమార్ తెలిపారు. మూడో రైల్వే లైన్ ఏర్పాటులో భాగంగా మరమ్మతులతో పాటు, ఆధునిక టెక్నాలజీతో తయారు చేసిన కొత్త రైల్వే గేట్లు ఏర్పాటు చేసి పాత గేట్లను తొలిగించినట్లు తెలిపారు.

సైన్స్ ఒలింపియాడ్‌కు విశేష స్పందన



ఒలింపియాడ్ పరీక్ష రాస్తున్న వీఆర్‌పేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు

శృంగవరపుకోట: మండలంలో వెంకటరమణపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం జాతీయ సైన్స్ ఒలింపియాడ్ పరీక్ష నిర్వహించారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. విద్యార్థుల్లో సైన్స్ పట్ల ఆసక్తి కలిగించేందుకు ఇటువంటి పరీక్షలు ఎంతగానో దోహదపడతాయని సైన్స్ ఉపాధ్యాయుడు సుదాప్రసాదరావు తెలిపారు.

మద్యం బెల్ట్‌షాపులపై దాడులు

మెరకముడిదాం: మెరకముడిదాం, ఉత్తరావల్లి, గర్భాం గ్రామాల్లో మద్యం బెల్ట్‌షాపులపై చీపురుపల్లి ఎక్సైజ్ సీఐ సీహెచ్ చక్రవర్తి, ఎస్సైలు గంగాధర్, గిరీష్ తమ సిబ్బందితో కలిసి మంగళవారం సాయంత్రం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 28 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. బెల్ట్‌షాపులను నిర్వహిస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. గ్రామాల్లో ఎవరైనా మద్యం బెల్ట్‌షాపులు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గృహనిర్మాణాల పరిశీలన



హౌసింగ్ లబ్ధిదారులను విచారిస్తున్న విజిలెన్స్ అధికారులు

శృంగవరపుకోట: పేదలు కట్టుకున్న ఇళ్లపై ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు ఆదేశించింది. దీంతో గత కొద్ది రోజులుగా గృహనిర్మాణశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపడుతున్నారు. బొడ్డవర గ్రామంలో విజిలెన్స్ అధికారులు మంగళవారం పర్యటించారు. హౌసింగ్ లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాలపై ఆరాతీశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సిబ్బందితో కలిసి లేఅవుట్లు పరిశీలిస్తున్నామని, క్షేత్రస్థాయి పరిశీలన తర్వాత నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని విజిలెన్స్ అధికారి ఎ.కామేశ్వరరావు చెప్పారు.

ఉప్పద్రావణం పిచికారీతో మొలకల నివారణ

లక్కవరపుకోట: మండలంలోని శ్రీరాంపురం, రెల్లిగొరమ్మపేట, లక్కవరపుకోట, జమ్మదేవిపేట తదితర గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి స్వాతికుమారి, సచివాలయ అగ్రికల్చర్ అసిస్టెంట్లు మంగళవారం విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో వరి పంటలను పరిశీలించారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వరి పనలు తడిచిపోవడంతో పలుచోట్ల మొలకలు రావడం గమనించారు. మొలకలు రాకుండా ఉండేందుకు 10 లీటర్ల నీటిలో కిలో ఉప్పు కలిపి ఆ ద్రావణాన్ని పనలు తడిచేలా పిచికారీ చేయాలని రైతులకు సూచించారు.

చెప్పేదొకటి.. చేసేదొకటి

రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో మాత్రమే విక్రయించాలి. రైతుల కోసమే రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ప్రభుత్వమే మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తుంది. ఎక్కడా దళారీ వ్యవస్థకు ఆస్కారం లేకుండా చర్యలు చేపట్టాం. దళారీలు ధాన్యం కొనుగోలు చేసి రవాణా చేస్తే అడుగు కూడా కదలనివ్వం. చెక్ పోస్టులు ద్వారా అడ్డుకుంటాం. **ఇదీ ప్రభుత్వం బయిటకు చెబుతున్న మాట.**

ఉభయ గోదావరి జిల్లాల నుంచి భారీ ఎత్తున దళారీలు రంగంలోకి దిగారు. ఏకంగా గ్రామాల్లోకి వెళ్లి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి లారీల్లో ఎత్తుకుని గోదావరి జిల్లాలకు తరలిస్తున్నారు. ఎక్కడికక్కడే చెక్ పోస్టులు ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. ఇప్పటికే భారీ స్థాయిలో ధాన్యం రవాణా జరిగిపోయింది. **ఇదీ క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిస్థితి**



గుర్ల మండల కేంద్రంలో వరి పంట కోసి కుప్పలు పెడుతున్న రైతులు(ఫైల్)

నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు లక్ష్యాలు ఇలా..

మండలం	లక్ష్యం(మెట్రిక్ టన్నులు)	కొనుగోలు చేసింది
చీపురుపల్లి	1358.910	611.240
గుర్ల	2043.180	947.180
గరివిడి	3168.640	2274.880
మెరకముడిదాం	5432.388	3232.640
మొత్తం	12,003.118	7066.28

- పూర్తిస్థాయిలో ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- ధాన్యం కొనుగోలు జీవోలో స్పష్టత కరువు
- దళారీలకు గ్రీన్ కార్పెట్ వేసిన ప్రభుత్వం
- గత్యంతరం లేక దళారీలకు పంట అమ్ముకుంటున్న రైతులు
- గత ప్రభుత్వంలో రైతుభరోసా కేంద్రాల్లోనే ధాన్యం కొనుగోలు

చీపురుపల్లి: ధాన్యం కొనుగోలుకు సంబంధించి ప్రభుత్వం చెప్పేదానికి క్షేత్రస్థాయిలో జరుగుతున్న దానికి అసలు పొంతన లేదు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వం ఇచ్చిన జీవోలు ఎక్కడా అమలు జరగడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ప్రదర్శిస్తున్న నిర్లక్ష్యధోరణే దీనంతటికీ కారణం. అన్ని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రభుత్వం చెపుతున్నప్పటికీ ఎక్కడా కొనుగోలు చేపట్టడం లేదు. చేసేది లేక రైతులు తాము పండించిన పంటను దళారీలకు అమ్ముకోవాల్సిన దుస్థితి నెలకొంది.

నియోజకవర్గంలో..

నియోజకవర్గంలోని చీపురుపల్లి మండలంలో 14 రైతు సేవా కేంద్రాలు, గరివిడి మండలంలో 21, గుర్ల మండలంలో 24, మెరకముడిదాం మండలంలో 18 రైతు రైతు సేవా కేంద్రాలు ఉన్నాయి. అన్ని రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని అధికారులు చెపుతున్నారు. కానీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్పష్టతలేని జీవోలు

ఇది ఇలా ఉండగా ధాన్యం కొనుగోలు విషయంలో స్పష్టత లేని జీవోలు ప్రభు త్వం విడుదల చేయడంలోనే దళారీలకు సహకారం అందిస్తున్న విషయం తేటతెల్లమవుతోంది. రైతు సేవా కేంద్రాల్లోనే రై తులు ధాన్యం అమ్మకాలు జరగాలని ఓ వైపు ప్రభుత్వం చెపుతున్నప్పటికీ ఇతర జిల్లాలకు ధాన్యం రవాణా నిషేధమనే విషయా న్ని జీవోల్లో ఎక్కడా పేర్కొనలేదు. దీంతో ఇతర జిల్లాల నుంచి దళారీలు వచ్చి ఇష్టారాజ్యంగా ధాన్యం కొనుగోలు చేస్తూ రవాణా చేస్తున్నారు.

12వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 12,003.118 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణను ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. దీని కోసం నాలుగు మండలాల్లో 87 రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. అయితే డిసెంబర్ మొదటి వారం పూర్తవుతున్నప్పటికీ ఇంతవరకు కేవలం 7066.28 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేసినట్లు వ్యవసాయశాఖ లెక్కల్లో చూపిస్తున్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు మెరుగుపడేలా బోధన



మరుపల్లి పాఠశాలలో ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న ఏఎంఓ బి.ప్రసాద్

గజపతినగరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల అభ్యసనా స్థాయి మెరుగుపడేలా బోధన చేయాలని జిల్లా అకడమిక్ మోనటరింగ్ ఆఫీసర్ బి.ప్రసాద్ ఉపాధ్యాయులకు సూచించారు. మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఏపీ మోడల్ స్కూల్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా బోధించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపడం ద్వారా వారిని ఏగ్రేడ్‌కు తీసుకురావాలని సూచించారు. త్వరలో జరగనున్న పదో తరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలన్నారు. అనంతరం పురిటిపెంట రెగ్యులర్ పాఠశాలను తనిఖీ చేశారు. అక్కడి రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట డైట్ వైస్ ప్రిన్స్‌పాల్ కె.రామకృష్ణ, డైట్ లెక్చరర్ పి.రవికుమార్, గజపతినగరం ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతంపై దృష్టి సారించండి



సజ్జల రామకృష్ణారెడ్డితో బొండపల్లి, మెంటాడ, ఎల్.కోట ఎంపీపీలు చలంనాయుడు, సన్యాసినాయుడు, శ్రీనివాసరావు

బొండపల్లి: గ్రామస్థాయి నుంచి వైఎస్సార్‌సీపీ బలోపేతం చేసేందుకు పార్టీకి చెందిన ఎంపీపీలు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డి దిశానిర్దేశం చేశారని ఎంపీపీ చల్లా చలంనాయుడు తెలిపారు. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్రం కార్యాయలంలో మంగళవారం పార్టీకి చెందిన ఎంపీపీలతో సార్వత్రిక ఎన్నికల్లో ఓటమిపై విస్తృత్తంగా చర్చించినట్లు చెప్పారు. మండలాల్లో పార్టీ ఓటమికి గల కారణాలను అడిగి తెలుసుకోవంతో పాటు భవిష్యత్తులో పార్టీ బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించడం జరిగిందన్నారు. పార్టీకి పూర్వ వైభవం తెచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని దిశానిర్దేశం చేసినట్లు చెప్పారు.

ప్రేమ చూపాలి.. ప్రోత్సహించాలి

విభిన్న ప్రతిభావంతుల పట్ల ప్రేమ, ఆప్యాయత చూపాలని, వారిలో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే వారు ఎంచుకున్న రంగంలో రాణించగలరని వక్తలు అన్నారు. అంతర్జాతీయ దివ్యాంగ దినోత్సవం సందర్భంగా భవిత కేంద్రాల్లో మంగళవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. దివ్యాంగులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలన్నారు. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ ఉంటుందని, దాన్ని గుర్తించి ప్రోత్సహించినట్లయితే దివ్యాంగ విద్యార్థులు కూడా సాధారణ విద్యార్థుల మాదిరిగా రాణిస్తారని అన్నారు. భవిత కేంద్రాల్లో అందిస్తున్న సేవలు, ప్రభుత్వం అందిస్తున్న పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం చిన్నారులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

– సాక్షి నెట్‌వర్క్



ఎస్.కోట: భవిత కేంద్రం ప్రాంగణంలో విభిన్న ప్రతిభావంతుల ర్యాలీ



మెరకముడదాం: భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థికి బహుమతి అందజేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్



వేపాడ: వల్లంపూడి భవిత కేంద్రంలో..



ఎల్.కోట: విభిన్న ప్రతిభావంతులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ సీహెచ్ కూర్మారావు



కొత్తవలస: భవిత కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంఈఓ శ్రీదేవి



గంట్యాడ: కొర్లాం భవిత కేంద్రంలో మాట్లాడుతున్న ఎంఈఓ విజయకుమారి



బొండపల్లి: అంబటివలస ఎంపీపీ స్కూల్‌లో చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓ-2 అల్లు వెంకటరమణ, ఉపాధ్యాయులు



గజపతినగరం: ప్రత్యేక అవసరాల పిల్లలకు బహుమతులను ప్రదానం చేస్తున్న ఎంఈఓలు విమలమ్మ, సాయిచక్రధర్, తదితరులు



దత్తిరాజేరు: దివ్యాంగులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్



చీపురుపల్లి: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



చీపురుపల్లి రూరల్(గరివిడి): దివ్యాంగ చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు పి.రామారావు, డి.అప్పన్న, ప్రజాప్రతినిధులు

తాగునీటి పైపులైన్ల పరిశీలన



చిన్నతామరాపల్లిలో పైపు లైన్లు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బొండపల్లి: మురుగునీటి కాలువల్లో ఉన్న తాగునీటి పైపులైన్లు తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ జి.గిరిబాల సూచించారు. మండలంలోని చిన్న తామరాపల్లి, బి.రాజేరు గ్రామాల్లో మురుగునీటి కాలువల్లో ఉన్న పైపులైన్లను మంగళవారం పరిశీలించారు. తాగునీరు కలుషితం కాకుండా ఉండాలంటే తప్పనిసరిగా పైపులైన్లను తొలగించి వాటిని రోడ్డు పక్కన ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

భక్తిశ్రద్ధలతో మూలానక్షత్ర పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

బొండపల్లి: మండలంలోని దేవుపల్లి గ్రామంలో ఉన్న రాజరాజేశ్వరీ అమ్మవారి ఆలయంలో మంగళవారం మూలానక్షత్ర పూజలను ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. జిల్లా నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. కుంకుమ, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు.

హుండీ కానుకల లెక్కింపు



దారగంగమ్మ ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

శృంగవరపుకోట: స్థానిక పుణ్యగిరి దేవస్థానం పరిధిలోని ఉమాకోటిలింగేశ్వరస్వామి, గ్రామ దేవత దారగంగమ్మ ఆలయాల్లో హుండీ కానుకలను దేవాదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. పుణ్యగిరి కొండపై ఉన్న ఉమాకోటిలింగేశ్వరస్వామి ఆలయ హుండీ ద్వారా రూ.5,56,739లు, శివాలయం హుండీ ద్వారా రూ.4,17,432లు, దారగంగమ్మ ఆలయ హుండీ ద్వారా రూ.1,39,307లు ఆదాయం సమకూరినట్లు దేవస్థానం ఈఓ నాగేంద్ర తెలిపారు. లెక్కింపులో ఆయా దేవాలయాల అర్చకులు, దేవాదాయశాఖ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

వ్యాధుల వ్యాప్తిపై సమాచారం ఇవ్వండి



మాట్లాడుతున్న జిల్లా మలేరియా అధికారి మణి

గంట్యాడ: గ్రామాల్లో వ్యాధుల వ్యాప్తిపై వెంటనే సమాచారం ఇవ్వాలని జిల్లా మలేరియా అధికారి వై.మణి అన్నారు. గంట్యాడ పీహెచ్‌సీలో మంగళవారం ఆశ వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మలేరియా, డెంగీ లక్షణాలు ఉన్న వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయాలని, వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయిన వారికి చికిత్స కోసం రిఫరల్ ఆస్పత్రికి పంపించాలన్నారు. గ్రామాల్లో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేటట్టు చూడాలన్నారు. సమావేశంలో ఆశ కోఆర్డినేటర్ మహాలక్ష్మి, హెల్త్ ఎడ్యుకేటర్ ఎర్రన్న, తదితరులు పాల్గొన్నారు.

అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



కిండాం అగ్రహారంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏఓ మల్లికార్జునరావు

బొండపల్లి: రబీ సీజన్‌లో చేపట్టే అపరాల సాగులో సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని ఏఓ పీవీ మల్లికార్జునరావు సూచించారు. మండలంలోని కిండాం అగ్రహారం, రాచకిండాం గ్రామాల్లో మంగళవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వరి కోతలు పూర్తయిన అనంతరం అపరాల విత్తనాలు వేసుకునేముందు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలకు ధాన్యం తడిచినట్లయితే మొలకలు రాకుండా ఉండేందుకు ఉప్పునీటి ద్రావణాన్ని పిచిచారీ చేయాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సహాయకులు అప్పలనాయుడు, నిర్మల, రైతులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: మిరప పంటను పరిశీలిస్తున్న ఏఓ అనురాధ

వ్యవసాయాధికారుల సలహాలు పాటించాలి

దత్తిరాజేరు: వర్షాలు తగ్గుముఖం పట్టినప్పటికీ రైతులు వరి కోతలు, నూర్పులు చేపట్టే సమయంలో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఏఓ అనురాధ అన్నారు. చౌదంతివలసలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎంపీపీ గేదెల సింహాద్రిఅప్పలనాయుడు పొలంలో మిరప పంటను, తడిసిన వరి కుప్పలను, కోతలు సిద్ధంగా ఉన్న వరి పంటను పరిశీలించారు. అనంతరం గ్రామసభలో రైతులను ఉద్దేశించి మాట్లాడారు. రబీ సీజన్‌లో వేసిన పంటలకు వీపీఏల సలహాల మేరకు రసాయన ఎరువులను తగిన మోతాదులో వినియోగించాలని సూచించారు.

సరైన ప్రణాళికలతో సంఘాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఏపీఎం నారాయణరావు

చీపురుపల్లి రూరల్(గరివిడి): శిక్షణ కార్యక్రమాలు సంఘాల అభివృద్ధికి దోహదపడతాయని, సంఘాల్లో ఉండే సభ్యులు స్వయంశక్తితో ఆర్థికంగా బలోపేతం అవ్వాలని ఏపీఎం పి.నారాయణరావు అన్నారు. గరివిడి మండల సమాఖ్య ఆధ్వర్యంలో గ్రామ సంఘం సభ్యులకు మంగళవారం విజన్ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి తీసుకుంటున్న రుణాలతో సంఘాలు ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడితే ఆర్థికంగా అభివృద్ధి చెందుతారో, ఎలాంటి కార్యక్రమాలు చేపట్టాలో వివరించారు. గ్రామ సంఘం, స్వయం సహాయక సంఘాల సహకారంతో మూడు రోజుల పాటు నిర్వహించే ఈ శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం, లీగల్ కోఆర్డినేటర్ వి.విశ్వేశ్వరరావు, టీటీలు అరుణ, పద్మ, ఎఫ్‌పీఓ ఏపీఎంలు సత్యవతి, సత్యనారాయణ, శైలేష్, ఉమామహేష్, విజయ పైడేశ్వరీదేవి, సీతారామ్, ఎల్‌సీ దుర్గాప్రసాద్, సీసీలు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీల దోపిడీ ఆపండి



ఎస్.కోట: విశాఖ-అరకు రోడ్డులో రాస్తారోకో చేస్తున్న సీపీఎం శ్రేణులు



లక్కవరపుకోట: విద్యుత్‌శాఖ ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

శృంగవరపుకోట: విద్యుత్ బిల్లులో ట్రూఅప్ చార్జీల పేరుతో సాగిస్తున్న అక్రమ దోపిడీని ఆపాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆ పార్టీ మండల కార్యదర్శి మద్దిల రమణ నేతృత్వంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద విశాఖ-అరుకు రోడ్డులో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ.. ట్రూఅప్ చార్జీల పేరుతో విద్యుత్ వినియోగదారులపై కూటమి ప్రభుత్వం రూ.17,989 కోట్లు భారం మోపుతోందన్నారు. గత ప్రభుత్వం విద్యుత్ చార్జీలు స్వల్పంగా పెంచితే బాదుడే బాదుడు అంటూ వీధుల్లో గోల చేసిన చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు ఇప్పుడు ఇదే రకం బాదుడో సమాధానం చెప్పాలన్నారు. పెంచిన ట్రూఅప్ చార్జీల నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సర్దుబాటు చార్జీల పేరుతో ఎన్నిసార్లు ప్రజల్ని దోచుకుంటారని ప్రశ్నించారు. సోలార్ విద్యుత్ కొనుగోలులో జరిగిన కుంభకోణంపై ప్రభుత్వం నోరు విప్పాలని డిమాండ్ చేశారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ద్వారా ఎకరానికి రూ.5 లక్షలు అదానీ దండుకుని, భూములిచ్చిన రైతుకు ఎకరానికి రూ.30 వేలు ఇప్పించటం సిగ్గుమాలిన చర్య కాదా అని ప్రశ్నించారు. మోడీ పాలనలో కార్మికుల వేతనాలు 8 నుంచి 3 శాతానికి పడిపోగా, నిత్యావసరాల ధరలు మాత్రం 8 నుంచి 16 శాతానికి పెరిగాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు సీహెచ్ ముత్యాలు, కె.రమేష్, వెంకటరావు, పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

పెంచిన విద్యుత్ చార్జీలు వెనక్కి తీసుకోవాలి

లక్కవరపుకోట: ట్రూఅప్ చార్జీల పేరుతో ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి వేల కోట్ల రూపాయలు భారాన్ని ప్రజలపై మోపిందని సీఐటీయూ నాయకుడు గాడి అప్పారావు అన్నారు. విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యుత్ చార్జీల పెంపుపై పోరాటం చేసిన చంద్రబాబునాయుడు తాను అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను తగ్గిస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి ఆరు నెలల్లోనే రెండు సార్లు పెంచడంపై అసహనం వ్యక్తం చేశారు. పెంచిన విద్యుత్ చార్జీలను వెంటనే రద్దుచేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఏఈకి వినతిపత్రం అందజేశారు.